క్లుప్తంగా

21న నూకాలమ్మతల్లి తీర్థం



యండపల్లిలో వేంచేసియున్న నూకాలమ్మతల్లి

కొత్తపల్లి: మండలంలో యండపల్లిలో వేంచేసిన నూకాలమ్మ అమ్మవారి తీర్థం ఈ నెల 21న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఏటా ఉగాదికి ముందు రోజు వచ్చే కొత్త అమావాస్యకు అమ్మవారి జాతరను నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా ఈ నెల 20వ తేదీ రాత్రి అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు ఆలయాన్ని రంగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున అన్నివిధాలా ఆదుకుంటామని మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని యండపల్లి శివారు జోన్నలగరువుకు చెందిన బత్తిన రజనీ కుమారి గేదెల పాక ఇటీవల ప్రమాదవశాత్తూ కాలిపోయింది. కాగా బాధిత కుటుంబాన్ని గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఉప సర్పంచ్ గుండ్ర చిన్నారావు, ఎంపీటీసీ బర్రె రవి, కాశి సత్తిబాబు పాల్గొన్నారు.

విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి



సామర్లకోట ఈటీసీలో ఆపద మిత్రలకు శిక్షణ ఇస్తున్న శ్రీనివాస్

సామర్లకోట: విపత్తుల వేళ ఆపద మిత్రలు అప్రమత్తంగా ఉండాలని ఈటీసీ మేనేజరు పి.శ్రీనివాసు అన్నారు. తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఆపద మిత్రలకు మూడో రోజు ఆయన శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం ఏడో బ్యాచ్ శిక్షణ జరుగుతోంది. వివిధ శాఖలకు చెందిన అధికారులు ఇచ్చిన శిక్షణలోని కీలక అంశాలను నోట్ చేసుకుని, శిక్షణ అనంతరం నిర్వహించే పరీక్షలో రాయాలన్నారు. విప్పత్తుల నివారణ సంస్థ ప్రాజెక్టు మేనేజరు కిరణ్మయి, విస్తరణ శిక్షణ కేంద్రం ఫ్యాకల్టీలు వెంకటేశ్వరరావు, ఎంఎస్ఎన్ రెడ్డి పర్యవేక్షించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



వీకే రాయపురంలో విద్యార్థులకు మెటీరియల్ అందజేసిన నాయకులు

సామర్లకోట: మండల పరిధి వీకే రాయపురం హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు గురువారం పరీక్ష మెటీరియల్ అందజేశారు. ఈ మేరకు విజన్ ఫౌండేషన్ ద్వారా ఫారోన్ బాప్టిస్టు చర్చి పాస్టర్లు ప్రార్థనలు చేసి అట్టలు, పెన్నులు, స్కేల్ అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గొల్లపల్లి నానాజీ, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



సామర్లకోట-పిఠాపురం రోడ్డులో ట్రాక్టర్ నుంచి పడిపోయిన కర్రలు

సామర్లకోట: పిఠాపురం రోడ్డులో కర్రల లోడ్‌తో వెళుతున్న ట్రాక్టరు నుంచి ఒకసారిగా కర్రలు రోడ్డుపై పడి పోయాయి. ఆ సమయంలో ఆ రోడ్డులో రాకపోకలు లేక పోవడంతో పెను ప్రమాదం జరిగింది. ఈ రోడ్డులో చిన్న వాహనాలతో పాటు భారీ వాహనాల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. కర్రలు కింద పడిన సమయంలో రాకపోకలు జరగలేదు. ట్రాక్టరుపై వేసిన కర్రల లోడు తాడు తెగి ఈ ఘటన చోటుచేసుకుంది. ఉప్పాడ నుంచి పెద్దాపురంలోని ఒక ప్రైవేటు ఫ్యాక్టరీకి ఈ కర్రల లోడ్‌ను తీసుకు వెళుతున్న ట్రాక్టరు డ్రైవరు రాము తెలిపారు.

అజొల్లా సాగు.. లాభాలు బాగు

- పాడిపంటలకు ఎంతో ఉపయోగకరం
- పశు విజ్ఞాన బడి ద్వారా అవగాహన
- పెంపకంపై ఆసక్తి చూపుతున్న రైతులు



అజొల్లా పెంపకానికి పిట్ తయారు చేస్తున్న రైతులు

పిఠాపురం: పాడి, పంట రైతుకు రెండు కళ్లు లాంటివి. పంట పండించే రైతుకు పాడి ఉంటేనే వ్యవసాయం బాగుంటుంది. రైతన్నకు దన్నుగా నిలిచేది పశు సంపద. తన ఆరోగ్యం కంటే తనకు ఆదాయాన్నిచ్చే పశుపోషణపై ఎక్కువ శ్రద్ధ చూపుతాడు అన్నదాత. పశువు ఆరోగ్యంగా ఉండాలన్నా, పాల దిగుబడి పెరగాలన్నా మేతపైనే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం వ్యవసాయం వ్యాపారంగా మారుతున్న తరుణంలో పాడి రైతులను పశుగ్రాసం కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో పశువుల మేత ఖర్చు తగ్గించుకునేందుకు, పోషక విలువలను పెంచేందుకు అజొల్లా రైతులకు ఒక వరంగా మారింది. ఇది ఒక్క పశువులకే కాదు కోళ్లు, కుందేళ్లు, చేపలు తదితర వాటికి అత్యధిక పోషక విలువలు ఉన్న మేతగా గుర్తింపు పొందింది. ఇప్పటికే సంచార పశు వైద్యశాలలతో పాడి రైతులకు ఊతమిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు పశువిజ్ఞాన బడి పేరుతో అజొల్లా పెంపకంపై రైతులకు శిక్షణ ఇస్తోంది. పశువైద్యాధికారులు నేరుగా రైతుల పొలాల్లోకి వెళ్లి రైతులకు అజొల్లా తయారీ విధానాన్ని వివరిస్తున్నారు.

తయారీ విధానం ఇలా..

ముందుగా ఎత్తయిన ప్రదేశాన్ని నీరు నిలవని చోటును ఎంచుకోవాలి. 2.5 మీటర్ల పొడవు, 1.5 మీటర్ల వెడల్పు, 20 సెంటీ మీటర్ల లోతు ఉండే విధంగా గుంతలు తీసుకోవాలి. పాలిథిన్ పట్టాను వేసుకుని నీరు ఇంకి పోకుండా ఏర్పాటు చేసుకోవాలి. దానిలో సారవంతమైన మట్టిని (30 నుంచి 35 కిలోల) చల్లుకోవాలి. 15 నుంచి 20 లీటర్ల నీటికి 2 నుంచి 5 కిలోల పేడను కలిపి చిక్కని పేస్టులా తయారు చేసుకోవాలి. దానికి 40 గ్రాముల సూపర్ ఫాస్పేట్ కలిపి గుంత అంతా పరచుకోవాలి. ఆ గుంతలో 10 సెంటీ మీటర్ల ఎత్తు వరకు నీటిని పెట్టి, దానిలో అజొల్లా విత్తనాలు చల్లుకోవాలి. దానిపై నీటిని చిమ్మితే అజొల్లా మొక్కలు ఏపుగా ఎదుగుతాయి. ఒక తొట్టి నిండా తయారైన అజొల్లా ఒక పాడి పశువుకు సరిపోతుంది. రైతు తనకున్న పశువులను బట్టి అన్ని తొట్టెలను ఏర్పాటు చేసుకోవాలి. అవసరాన్ని బట్టి అప్పుడప్పుడు మట్టిని, నీటిని మార్చుకోవాల్సి ఉంటుంది. వారానికి ఒకసారి 500 గ్రాముల ఆవుపేడకు 20 గ్రాముల సూపర్ ఫాస్పేట్, 5 లీటర్ల నీటికి కలిపి వేసుకోవడం వల్ల అజొల్లా ఏపుగా పెరుగుతుంది. ఈ తొట్టెలపై ఎండ పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఒక గుంతకు రూ.1800 నుంచి రూ.2 వేలు వరకూ ఖర్చవుతుంది. ఒక తొట్టె నుంచి రోజుకు ఒక కిలో అజొల్లా తీసుకోవచ్చు.

ప్రయోజనాలు

- ఆవులు, గేదెలు, మేకలు, కోళ్లతో పాటు చేపలకు ఆహారంగా ఉపయోగపడుతుంది.
- ప్రతీరోజూ పాడి గేదెలకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఒక కేజీ వంతున పాలిచ్చే పశువుకు దాణాగా పెట్టడం వల్ల దాణా ఖర్చు తగ్గడమే కాకుండా పాల దిగుబడి, వెన్న శాతం పెరుగుతాయి.
- అజొల్లాలో ప్రొటీన్లు, మాంసకృతులు అధికంగా ఉండడం వల్ల పశువు బలిష్టంగా మారుతుంది.
- పశువులు సమయానికి ఎదకి (సూడికి) వస్తాయి. దీని వల్ల పశు సంపద పెరుగుతుంది.
- అజొల్లాతో బహుళ ప్రయోజనాలు ఉండడంతో నియోజకవర్గంలో రైతులు తయారీపై ఆసక్తి చూపుతున్నారు.

అదనపు ఆదాయం



అజొల్లా మేత తయారు చేసుకోవడం ద్వారా అతి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చు. ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రోత్సాహకాలు అందిస్తోంది. పశు విజ్ఞాన బడి పేరుతో అజొల్లా పంపకంపై శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు చేసింది. పశు వైద్య సిబ్బంది పాడి ఉన్న ప్రతీ రైతుకు అజొల్లా తయారీపై శిక్షణ ఇస్తున్నారు. పశువులను కట్టుకునే గోశాల వద్దే వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు. దీని ద్వారా దాణా ఖర్చు చాలా తగ్గుతుంది. పాల ఉత్పత్తి పెరిగి నెలకు సుమారు రూ.10 వేల వరకూ అదనపు ఆదాయం సమకూరుతుంది.

డాక్టర్ హిమజ,
పశువైద్యాధికారి, గొల్లప్రోలు

చోరీలు నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు

కొత్తపల్లి: చోరీలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు స్థానిక ఎస్సై రామలింగేశ్వరరావు గురువారం తెలిపారు. ప్రస్తుత వేసవిలో చోరీలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవి సెలవులకు ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసులకు ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు. తీర ప్రాంతంలో రాత్రిపూట ప్రయాణం చేసేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో జాతరలు, తీర్థాలు పేరుతో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సారాతో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో 52 లీటర్ల సారాతో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సీఐ పి.అశోక్ తెలిపారు. పెదశంకర్లపూడిలో బైక్‌పై సారా తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన గీసాల దుర్గా నాగేంద్రను అరెస్టు చేసి, అతని నుండి బైక్‌తో పాటు 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గ్రామంలో రెండు లీటర్ల సారాతో పాలిక నాగేశ్వరరావును అరెస్టు చేసినట్టు చెప్పారు. కాగా సారా తయారీకి నల్లబెల్లం విక్రయిస్తున్న ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామానికి చెందిన పాదం సుబ్బారావుపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ అశోక్ వివరించారు.

పేదల సంక్షేమమే సీఎం లక్ష్యం



మాధవపట్నంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు



జగనన్న కాలనీలో గృహ ప్రవేశం చేసిన దంపతులకు పట్టు వస్త్రాలు, సీఎం జగన్ ఫొటో అందజేసిన దవులూరి దొరబాబు

- మాధవపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం
- లబ్ధిదారులకు పథకాలను వివరించిన దొరబాబు

సామర్లకోట: పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పని చేస్తున్నారని, ఇందులో భాగంగానే ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కిందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గురువారం సాయంత్రం మాధవపట్నం సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గాదేవి, గుత్తుల కృష్ణార్జునరావు ఆధ్వర్యంలో దొరబాబు గడప గడపకూ తిరిగి మూడున్నరేళ్లలో లబ్ధిదారులు పొందిన ప్రయోజనాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో జగన్ సీఎం కావడానికి ప్రతి ఒక్కరి మద్దతు ఉండాలన్నారు. 35 ఏళ్ల తరువాత స్థానికుడైన నాకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఇచ్చారని, నియోజకవర్గ ప్రజలకు మేలు చేయడానికి రాజకీయల్లోనికి వచ్చానని తెలిపారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి సాధనాల నాగఫణిబాబు, సొసైటీ అధ్యక్షులు వీరంరెడ్డి నాని, వుటా వాసు పార్టీ నాయకులు హుస్సేన్‌పురం ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్, వీఆర్వోలు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరిన వేళ

నిరుపేదల సొంతింటి కల సీఎం జగన్‌తో సాకారమవుతోందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక ఈటీసీ లే అవుట్‌లోని జగనన్న కాలనీలో వెలిశెట్టి వీరభద్రరావు, రామలక్ష్మి దంపతుల గృహ ప్రవేశానికి దొరబాబు హాజరై దంపతులకు పట్టు వస్త్రాలు, సీఎం జగన్ ఫొటోను అందజేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల్లో డబుల్ ఎంట్రీలుంటే తొలగించవచ్చు

మున్సిపల్ ఆర్డీ సత్యనారాయణ



మున్సిపాలిటీలో రికార్డులు తనిఖీ చేస్తున్న మున్సిపల్ ఆర్డీ సత్యనారాయణ

పిఠాపురం: మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ ఎంట్రీ ఇంటి పన్నులు ఉంటే వాటిని కౌన్సిల్ అనుమతితో కమిషనర్ తొలగించవచ్చని మున్సిపల్ ఆర్డీ ఎస్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి కార్యాలయంలో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పన్నుల వసూళ్ల తీరును పరిశీలించారు. పన్నుల వసూలు విషయంలో తీసుకుంటున్న చర్యలపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో ప్రగతి సాధించాలన్నారు. పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకూ 60 శాతం పన్నులు వసూలు అయ్యాయని, మార్చి 31 నాటికి 85 శాతం పూర్తవుతాయని ఆయన తెలిపారు. తమ రీజియన్ పరిధిలో 65 శాతం పన్నులు కాగా 90 శాతం పూర్తవుతాయన్నారు. ఇంటి పన్ను చెల్లింపు విషయంలో ఎటువంటి రాయితీలు ఉండవని ఆయన తెలిపారు. రీజియన్ పరిధిలో ఉన్న ఉయ్యూరు మున్సిపాలిటీ పన్నుల వసూళ్లలో ఆఖరి స్థానంలో ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అన్ని పట్టణాల్లోనూ డ్రోన్ల ద్వారా రీ సర్వే జరుగుతోందని, వందేళ్ల నాటి ఆర్ఎస్ఆర్ సర్వేకి అనుగుణంగా నూతనంగా సర్వే చేసి ప్రతి ఇంటికీ గృహ హక్కు పత్రం ఇస్తారని వివరించారు. పట్టణాల్లో చెత్తపై యూజర్ చార్జీలు వసూలు చేసి క్లాప్ ఆధ్వర్యంలో ఏజన్సీ ఏర్పాటు చేసి వారి ద్వారా చెత్తను సేకరిస్తామని వివరించారు. పిఠాపురం పట్టణంలో సెకండ్ ఫేజ్‌లో యూజర్ చార్జీలు వసూలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, ఆర్వో శ్యామల, ఆర్ఐ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యంతో ఉపాధి పనులు

- ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్
- తొమ్మిది జిల్లాల డ్వామా అధికారులకు శిక్షణ



డ్వామా అధికారులకు శిక్షణ ఇస్తున్న ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు మరింత నాణ్యంగా, సాంకేతిక నైపుణ్యంతో నిర్వహించడానికి డ్వామా అధికారులకు శిక్షణ ఇస్తున్నట్టు విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ తెలిపారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలో పనిచేస్తున్న డ్వామా ఏపీడీ, ఏపీఓ, ఏసీ, టెక్నికల్ అసిస్టెంట్లకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణను గురువారం ఆయన ప్రారంభించారు. మొబైల్ యాప్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన పెరిగే విధంగా శిక్షణ ఉంటుందన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే పనుల గుర్తింపు, అంచనాల తయారు, మొక్కలు నాటడం, పుస్తకాల నిర్వహణ, మేట్ల పనితీరు, ఉపాధి హామీలో ఇప్పటి వరకు జరిగిన పనిలో లోపాలను గుర్తించి వాటిని సవరణ చేయడం, సామాజిక తనిఖీ వంటి అంశాలపై శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ కోఆర్డినేటర్ బందారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈటీసీ ఫ్యాకల్టీ ఎంఎస్ఎన్ రెడ్డి రీసోర్సు పరసన్న రమేష్, ఎం.సత్యనారాయణ, ఎస్. నరేష్‌బాబు, ఎస్.శ్యామల, వి.సురేషకుమార్, సీహెచ్‌వీవీ నరేష్, కేవీవీ సత్యనారాయణ, జీటీఎస్ సాగర్ మొదటి రోజు శిక్షణ నిర్వహించారు.

విద్యార్థులకు కాస్మెటిక్స్ పంపిణీ

సామర్లకోట: స్థానిక బీసీ బాలికల హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు తమ స్నేహితుని జ్ఞాపకార్థం కాస్మెటిక్స్ అందజేశారు. గత ఏడాది సెప్టెంబర్‌లో లంకా శ్రీనివాసు రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. శ్రీనివాసు పేద ప్రజలకు ఉచిత సేవలు అందించేవాడు. అతని సేవలకు గుర్తుగా శ్రీనివాసు పుట్టి రోజును పురస్కరించుకొని స్నేహితుడు వెదురుపాక శివ విద్యార్థులకు సబ్బులు, బ్రెష్‌లు, టూత్ పేస్టులు, షాంపూలు, కొబ్బరి నూనె, పౌడరు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కౌన్సిలర్ రెడ్డి లోవకుమారి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కాస్మెటిక్స్ అందజేస్తున్న శివ

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి



శిక్షణకు హాజరైన అధికారులు

పిఠాపురం: ప్రభుత్వ నిబంధనల మేరకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా పగడ్బందీగా పదో తరగతి పరీక్షలు నిర్వహించాలని ఆర్‌జేడీ జి.నాగమణి అధికారులకు సూచించారు. పిఠాపురం డివిజన్ స్థాయిలో చీఫ్ సూపరింటిండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్స్, పరీక్షల నిర్వహణ అధికారులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో ఆమె పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. పదో తరగతి పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పదో తరగతి పరీక్షలు నిర్వహించే ప్రతీ రూమ్‌లోనూ సీటింగ్ వివరాలు ప్రదర్శించాలన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, రాజశేఖర్, వెంకటరావు పాల్గొన్నారు.

కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా జోగారావు



సామర్లకోట: పట్టణ సచివాలయ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా ఎం జోగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సాయంత్రం అయోధ్యరామపురం సచివాలయంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. సంఘ కార్యదర్శిగా కెఎస్ సింగరాజు ఎన్నికయ్యారు.

స్ఫూర్తిప్రదాత అమరజీవి

- ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి
- ఆయన త్యాగాలను కొనియాడిన నేతలు



కొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు



సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో అమరజీవికి నివాళులర్పిస్తున్న నేతలు



సామర్లకోట ఎంపీడీఓ కార్యాలయంలో..



బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో..

కొత్తపల్లి: మండలంలో అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పొట్టిశ్రీరాములు చిత్రపటాలకు పూలమాలలు నివాళులర్పించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ భాస్కరరావు ఆధ్వర్యంలోనూ, వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎం అరుణకుమారి ఆధ్వర్యంలోనూ పొట్టిశ్రీరాములు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అమరజీవి

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పిట్టా సత్యనారాయణ, పాగా సురేష్‌కుమార్, చల్లపల్లి వెంకటసత్యనారాయణ, మున్సిపల్ మేనేజరు అచ్యుతరాజు, డీఈఈ హుస్సేన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన అమరజీవికి నివాళులు అర్పించారు. ఎంపీడీఓ డి శ్రీలలిత, మండల ఇంజినీరింగ్ అధికారి కె.మణిమాల, ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, పరిపాలనాధికారి వి.సాయిబాబు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్ఎల్‌వీ కుమారి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్స్‌లో ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ, యు.సత్యనారాయణ, టి.శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో జయంతి నిర్వహించారు. పట్టణ, మండల పరిధిలోని అన్ని సచివాలయాలల్లోను పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళులు అర్పించారు. మతం సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ యార్లగడ్డ చిన్ని, రైతు సంఘ అధ్యక్షుడు కంటే బాబు, కౌన్సిలర్ బలుసు వాసు, అడబాల కుమారస్వామి తదితరులు నివాళ్లు అర్పించారు.

లోక కల్యాణం కోసం హోమం

సామర్లకోట: లోక కల్యాణార్థం హోమం నిర్వహిస్తున్నట్లు లలిత జ్యోతిష్య నిలయం అధినేత అల్లక్కి కాశీ విశ్వనాథం అన్నారు. స్థానిక పిఠాపురం రోడ్డులో ఉన్న జ్యోతిషాలయంలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో ఉండడానికి హోమం చేసినట్టు తెలిపారు. ఈ హోమాన్ని సామర్లకోట, పెద్దాపురం మండలం పులిమేరు గ్రామానికి చెందిన వారు నిర్వహించినట్టు తెలిపారు. జోగారావు శర్మ, సూర్యనారాయణ శర్మ సోదరులు హోమం నిర్వహించారు.

ఆటోను ఢీకొన్న కారు : ఐదుగురికి గాయాలు

కాకినాడ క్రైం: పిఠాపురం నుంచి కాకినాడకు వస్తున్న ఓ ఆటోలో ప్రయాణికులను కారు ఢీకొట్టింది. గురువారం సాయంత్రం ఐదుగురు వ్యక్తులు పిఠాపురం నుంచి కాకినాడకు వచ్చేందుకు పిఠాపురంలో ఆటో ఎక్కారు. కొంత దూరం ప్రయాణించే సరికి వెనుక నుంచి భారీగా పొగరావడాన్ని గుర్తించిన డ్రైవరు వాహనాన్ని నిలిపి చూసేందుకు వెనక్కు వెళ్లబోయాడు. ఇంతలో అతి వేగంగా వస్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదురుగు గాయాలపాలయ్యారు. వారిని స్థానికులు గురువారం రాత్రి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. సామర్లకోట మండలం పండ్రవాడ వద్ద జరిగిన ఈ ప్రమాదంలో మహ్మద్ నయీం, సాదీ నూకరత్న సుజ్ఞాన మణి, చిట్టుమూరి గన్నమ్మ, చిట్టుమూరి శ్రీజ, దడాల సుజాత గాయాలపాలయ్యారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కాకినాడలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలివీ.. కాకినాడ గ్రామీణం చీడీలదిబ్బకు చెందిన వానపల్లి నాగరాజు (35) వంటపని చేస్తుంటాడు. గురువారం తెల్లవారుజామున తన ద్విచక్రవాహనంపై సులభ్‌కాంప్లెక్స్‌కు వెళ్లాడు. మార్గమధ్యలో బాలాజీ చెరువు కూడలి చేరేసరికి అటుగా వస్తున్న ఓ లారీ నాగరాజు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగరాజు కిందికి పడిపోగా శరీరంపై నుంచి లారీ వెళ్లింది. తీవ్రగాయాలపాలైన క్షతగాత్రుడ్ని స్థానికులు గమనించి కాకినాడ జీజీహెచ్‌లో చేర్పగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాగరాజుకు భార్య కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు, కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.